www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 22 నవంబర్ 2024

5

అన్నమయ్య



'మిట్స్' అధ్యాపకురాలు నాగశ్వేతకు డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కళాశాల ఇసిఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గుత్తి నాగశ్వేతకు కర్ణాటక రాష్ట్రంలోని బెళగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పట్టా లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఇంప్లీమెంటేషన్ అఫ్ ఎలిప్టిక్ కర్వ్ క్రిప్టోగ్రఫీ ఉసింగ్ ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ అర్రే చేసిన పరిశోధనను గాను డాక్టరేట్‌ను అందించినట్లు చెప్పారు. గుత్తి నాగశ్వేతను కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్, తదితరులు అభినందనలు తెలియజేశారు.



నాగశ్వేతకు డాక్టరేట్ పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

కాలేటివాగు పనులపై విచారణ

రూ.2,200 కోట్ల చెల్లింపులపై నజర్
శాసనసభలో ఇరిగేషన్ మంత్రి ప్రకటన
ఇరిగేషన్ ఇంజినీర్లలో ఉలికిపాటు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ (కాలేటివాగు) అనుసంధాన పనులపై విచారణ ఖాయమైంది. బుధవారం శాసనమండలిలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానంగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విచారణ చేపట్టనున్నట్లు ప్రకటించారు. 2019 మార్చిలో రూ.5,0036 కోట్లతో జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. సుమారు రూ.2,200 కోట్ల మేర చేసిన బిల్లుల చెల్లింపుల అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలపై విచారణ చేపట్టనుంది. ప్రభుత్వ ఆదాయాన్ని ఖజానాకు రాకుండానే మూడు కార్పొరేషన్ల ద్వారా దారిమళ్లించి భారీగా సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. జిల్లాలోని పులివెందుల నుంచి అన్నమయ్య, చిత్తూరు జిల్లా పరిధిలోని పుంగనూరు, కుప్పం వరకు 20 టిఎంసిలతో 2.91 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలనే ఉద్దేశంతో అప్పటి వైసిపి సర్కారు ఎత్తిపోతల పనులు చేపట్టింది.



జిల్లా జలవనరుల శాఖ నిర్వహించిన టెండర్ల దగ్గర నుంచి, కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులు, బిల్లుల చెల్లింపుల వగైరా వివరాలపై శూలశోధన చేయనుంది. 2020 మార్చి నుంచి 2023 మార్చి నాటికి కాంట్రాక్టు దక్కించుకున్న వైసిపి మంత్రి వర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఓ మంత్రికి సంబంధించిన పిఎల్ఆర్, నవయుగ కాంట్రాక్టు సంస్థలు పనులు పూర్తి చేయడంలో అలక్ష్యాన్ని పరిగణలోకి తీసుకోనుంది. ఏడాదిన్నరలో 0.2 టిఎంసిల నుంచి 1.2 టిఎంసిల సామర్థ్యం కలిగిన కాలేటివాగు ఎత్తిపోతల పథకం పనులపై దృష్టి సారించనుంది. 2020 మార్చి నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి 22 శాతం మేర కాలేటివాగు పనుల్ని పూర్తి చేసింది. రూ.2,200 కోట్లు మేర బిల్లుల చెల్లింపులు చేసినట్లు సమాచారం. అధిక భాగం పనుల్ని మట్టి పనులపై ఆరా తీయనుంది. ముదివేడు, కాలేటివాగు రిజర్వాయర్ల మట్టి పనుల చెల్లింపుల్లో అక్రమాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కాంట్రాక్టు కంపెనీలకు చెల్లించిన సుమారు రూ.2,200 కోట్ల బిల్లుల చెల్లింపుల గోల్‌మాల్ వ్యవహారాన్ని పరిశీలించనుంది. ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టు సంస్థలకు వంతపాడి కోట్లాది రూపాయల బిల్లుల చెల్లింపులు అక్రమంగా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో విచారణకు ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. 2019 మార్చిలో జిఎన్ఎస్ఎన్, హెచ్ఎన్ఎస్ఎస్ పనుల అగ్రిమెంట్ కుదుర్చుకున్న సిఇలు, ఎస్ఇలు, ఇఇలు, డిఇలు, ఎఇలు ఉలికిపాటుకు గురికావడం గమనార్హం.

26న ర్యాలీ, సభను విజయవంతం చేయాలి

- కార్మిక, రైతు సంఘం నాయకుల పిలుపు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మిక, ఉద్యోగ, కర్షకుల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న ఆల్ ట్రేడ్ యూనియన్స్, అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబోయే ర్యాలీ, సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్ర పిలుపునిచ్చారు. గురువారం సంబంధిత కరపత్రాలు పలు సంఘాల ప్రతినిధులతో విడుదల విడుదల చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను పట్టణంలోని ప్రజలకు రైతులకు, కార్మిక, ఉద్యోగులకు వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, కర్షకుల పట్ల వినాశకర విధానాలు తీసుకొస్తూ కేవలం కార్పొరేట్లకు లాభాలు కోసమే ఊడిగం చేస్తుందని పేర్కొన్నారు. అందుకే రూ.15 లక్షల కోట రుణమాఫీ చేశారని తెలిపారు. కార్మికులకు నష్టం తెచ్చే నాలుగు లేబర్ కోడ్‌లను తెస్తుందని చెప్పారు. వ్యవసాయ రంగంలో మూడు నల్ల చట్టాలను రైతులు సంవత్సరం పాటు పోరాడి రద్దు చేసుకున్నారని పేర్కొన్నారు. ధరలు 300 రెట్లు పెరిగినా, కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయకపోవడం దారుణం అన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించాలని, ఉపాధి పథకం పటిష్టంగా అమలుచే యాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, విశాఖ ఉక్కు రక్షణకై పాటుపడాలని స్కీమ్ వర్కర్స్ జీతాలు పెంపుదల కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని, మహిళల రక్షణకోసం ప్రత్యేక చట్టాలు అమలు పరచాలని, ప్రజా పంపిణీ పథకం సమగ్రంగా అమలుచేయాలని కోరారు. నిరుద్యోగ సమస్యకు పరిశ్రమలు నెలకొల్పాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎ జెఎసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మురళీమోహన్ రాజు, అలీ, ఎల్ఐసి సంఘం నాయకులు విశ్వనాథ్, ఆదినారాయణ రెడ్డి, విద్యుత్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వి. రమణ, రాష్ట్ర నాయకులు కె. సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మిక, రైతు, ఉద్యోగ సంఘాల నాయకులు

దౌర్జన్యకారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం



జెసికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బి.కొత్తకోట మండలంలోని గొల్లపల్లి రెవెన్యూ గ్రామం, సర్వేనెంబర్ 427 బి2బిలో ఉన్న 2.27 ఎకరాల భూమిని కొందరు దౌర్జన్యం చేసి కాజేయాలని ప్రయత్నిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జెసి ఆదర్శ రాజేంద్రన్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట మండలం గొల్లపల్లి రెవెన్యూ గ్రామంలోని భూమిని దళితవాడలో నివసించే పోతుగాళ్ళ వీరప్ప, రమణప్ప, వెంకటరమణ, వేమన, వారి కుటుంబ సభ్యులు ఎన్నో ఏళ్లుగా అదే భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారని చెప్పారు.అదే గ్రామానికి చెందిన కొందరు వ్యవసాయం చేసుకుంటున్న దళితులపై దౌర్జన్యం చేస్తూ భూమిని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీనికోసం తప్పుడు వీలునామా, స్వాధీన పత్రాలను సృష్టించి భూమిని కాజేయాలని చూస్తున్నారన్నారు. తప్పుడు పత్రాలను తయారు చేయడంలో విఆర్ఒ ఎస్. రవి, తహశీల్దార్ ఎస్. రఫీక్ అహ్మద్, నిర్మలాదేవి సహకరిస్తున్నారని, వారిని విచారించి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం దుండగులు దౌర్జన్యంగా పొలంలోకి ప్రవేశించి అనుభవానికి భంగం కలిగిస్తూ తామే నిజమైన హక్కుదారులమని, చంపుతామని బెదిరిస్తూ ఉన్నారని అన్నారు. వారికి ఎలాంటి హక్కు అనుభవం లేనప్పటికీ తప్పుడు పత్రాలు సృష్టించి అనేక రకాలుగా హింసిస్తున్నారన్నారు. విషయంపై తహశీల్దార్‌కు తెలిసినా చర్యలు చేపట్టడం లేదని పేర్కొన్నారు. భూ అక్రమాలపై విచారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్‌టిసికి కార్గో ఆదాయం రూ.1.20 కోట్లు



పీలేరు కార్గో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న అధికారి జనార్ధన్

ప్రజాశక్తి-పీలేరు

ప్రజా రవాణా సంస్థకు కార్గో నిర్వహణ ద్వారా అన్నమయ్య, కడప జిల్లాల్లో నెలవారి రూ.1.20 కోట్లు ఆదాయం సమకూరుతోందని కార్గో అధికారి సి.జనార్ధన్ తెలిపారు. గురువారం ఆయన పీలేరులోని ఆర్‌టిసి కార్గో కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం కార్గో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో నెలవారి కార్గో ఆదాయ లక్ష్యం రూ.58.80 లక్షలు కాగా ప్రస్తుతం రూ.45 లక్షలు ఆదాయం వస్తోందన్నారు. కడప జిల్లాలో కార్గో ఆదాయం రూ.1.53 కోట్లు లక్ష్యం కాగా ప్రస్తుతం నెలవారీ రూ.75 లక్షలు మేరకు ఆదాయం సమకూరుతోందని తెలిపారు. కడప, ప్రొద్దుటూరు, మదనపల్లి ఆర్‌టిసి డిపోల్లోని కార్గో కేంద్రాలు అధిక ఆదాయంతో ప్రథమ స్థానంలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన కార్గో కేంద్రాల్లోనూ ఆదాయాన్ని పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. రెండు జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో కేంద్రాలతో పాటు అదనంగా ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రైవేటుగా కార్గో ఏజెంట్ల నియామకం జరిగిందని, వీరు బుక్ చేసిన పార్సిల్స్‌పై కమిషన్ ఇవ్వడం జరుగుతోందని పేర్కొన్నారు. కార్గోల ద్వారా నిషేధిత వస్తువులు, పదార్థాలు బుక్ చేసుకోవద్దని సూచించారు. ఆర్టీసీ కార్గో ద్వారా 45 గంటల్లో రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా వస్తువులు చేరవేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ చంద్ర, పీలేరు ఆర్‌టిసి సిఐ సుబ్బమ్మ, ఏజెంట్ తిరుమలయ్య, సహాయకులు రోషన్, అహ్మద్ పాల్గొన్నారు.



సిఐకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న ఐటిడిపి కడప నగర ఇన్‌ఛార్జి చంద్రశేఖర్

ఆర్‌జివి, పోసాని, శ్రీరెడ్డి, శ్యామలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కడప అర్బన్

సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి, అనిత, విద్యాశాఖ మంత్రి లోకేష్‌పై అసభ్యకర పోస్టింగులు, పదజాలాలు వాడిన సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మ, నటుడు, దర్శకుడు పోసాని కృష్ణమురళి, నటి శ్రీరెడ్డి, యాంకర్ శ్యామలపై కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఐటిడిపి కడప నగర ఇన్‌ఛార్జి బొమ్మిచెట్టి చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. గురువారం సిఐ రామకృష్ణకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం, డిప్యూటీ సిఎం, హోం మంత్రి, విద్యాశాఖ మంత్రి ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడి యాలో పోస్టింగులు పెట్టాలని పేర్కొన్నారు. అసభ్యకర పదజాలం కూడా వాడా రని తెలిపారు. ఇతర రాష్ట్రంలో తలదాచుకుంటున్న వారు ఆంధ్రప్రదేశ్ వైసిపి తో చేతులు కలిపి విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించి రాష్ట్రపతి పాలన వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీరిని అరెస్టు చేసి జైలుకు పంపాలని కోరారు. వన్‌టౌన్ సిఐ రామకృష్ణ ఫిర్యాదుపై స్పందిస్తూ సినీ నటులపై ఫిర్యా దును ఉన్న తాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యాయవాదిపై దాడి హేయం

- బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - రాయచోటి

తమిళనాడులోని హోసూరు కోర్టులో పనిచేస్తున్న న్యాయవాది కన్నన్‌పై అత్యంత దారుణంగా కొడవలితో దాడి చేసి హత్యాయత్నం చేసిన దంపతులు ఆనందం, సత్యవతిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డయ్య డిమాండ్ చేశారు. సమస్య ఏదైనాప్పటికీ చట్టపరిధిలోనే పరిష్కారం చేసుకోవాలి కానీ ఇలాంటి దారుణాలు పాల్పడకూడదని తెలియజేశారు. గురువారం రాయచోటి న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. దాడికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా భారత న్యాయవాదుల సంఘం నిరసన కార్యక్రమాలు నేడు చేపట్టిందని కడప, అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్ తెలియజేశారు. కక్షిదారుల దారుల తరపున వాదించే న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తక్షణం తేవాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థను బలోపేతం చేసి కక్షిదారులకు సత్వర న్యాయం అందించినట్లయితే ఇలాంటి దాడులకు చరమగీతం పాడే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. న్యాయవాదులపై ఇలాంటి దుర్మార్గమైన దాడులు చేయడం క్షమించరాన్ని నేరమని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి దేవపట్ల నాగమణి, న్యాయవాదులు రవిశంకర్, నరసింహారెడ్డి, రామాంజనేయులు, రాజ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మదనపల్లెను జిల్లా చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లెను జిల్లా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే షాజహాన్ బాష అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యానికి మునుపే రవీంద్రనాథ్ ఠాకూర్ మదనపల్లె బిటి కాలేజ్‌లోని బెసెంట్ హాల్‌లో బెంగాలీలో ఉన్న జాతీయ గీతాన్ని ఆంగ్లంలోకి అనువదించి ఆలపించిన గొప్పగడ్డ మదనపల్లి అని కొనియాడారు. ఆసియాలోనే అతిపెద్ద టమోటా మార్కెట్ యార్డ్ మదనపల్లెలో ఉందని తెలిపారు. ఇక్కడ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలన్నారు. మద్రాసు రాష్ట్రంలో రెండో జిల్లా కేంద్రంగా ఖ్యాతి గడించిన మదనపల్లెను జిల్లాగా ప్రకటించి మదనపల్లి ప్రాంత ప్రజల ఆత్మ గౌరవాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ కాపాడాలని శాసనసభలో ప్రసంగించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టేందుకు నిధులను మంజూరు చేయాలని అభ్యర్థించారు.

ఆదాయ, వ్యయాల వివరాలు ఇవ్వండి

- ఇఒను కోరిన సర్పంచ్, వార్డు సభ్యులు

ప్రజాశక్తి-పీలేరు: గ్రామ పంచాయతీ ఆదాయ, వ్యయాలు, నిధుల వివరాలు కోరుతూ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి గురు మోహన్‌కు వినతి పత్రం సమర్పించారు. గురువారం వారు స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శిని కలిసి 2024 జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ఆమోదించిన 15వ ఆర్థిక సంఘం నిధులు, అందిన సాధారణ నిధులు, ఖర్చు చేసిన నిధులు, భవనాల ప్రతిపాదనల వివరాలను అందించేయాల్సిందిగా సర్పంచ్, వార్డు సభ్యులు కార్యదర్శిని కలసి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనాథరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, నాగభూషణ, నాగరాజ నాయక్, ఆబిద్, కాలేష, మల్లికార్జున రెడ్డి, ఉదయ్ కుమార్, పిక్కా రమణ, సంధ్యావది, కళావతి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్, వార్డు సభ్యులు

సామాజిక స్పృహ కలిగి ఉండాలి : జిఎన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చిన్నారులకు విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహపట్ల అవగాహన కల్పించాలని రీజెన్సీ నలంద విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి.ఎన్.నాయుడు అన్నారు. గురువారం నలంద పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక చైతన్యం కల్పించేందుకు తమ పాఠ శాల విద్యార్థులచే పురపాలక పరిధి లో పారిశుధ్య నిర్వహణ చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సలహాలు తీసుకోనున్నట్లు వివరించారు. యువత బాధ్యతారాహిత్యం సమాజానికి చేటని, నేటి పిల్లలే రేపటి పౌరులని, చిన్నారులను, విద్యార్థులను ఎప్పటికప్పుడు చైతన్యవంతులు చేయాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. తమ పాఠశాల విద్యార్థులను సమాజ సేవలో భాగం చేసేందుకు ఇప్పటినుంచే పునాదులు వేస్తున్నట్లు వివరించారు. ఈ నెల 24, డిసెంబర్ ఒకటవ తేదీలలో తమ పాఠశాల సిబ్బంది, 500 మంది విద్యార్థులు పారిశుధ్య కార్మికులతో కలిసి పట్టణ పరిశుభ్రతకు నడుం బిగించి స్వచ్ఛందంగా పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ బృహత్తరమైన కార్యక్రమంలో ఆసక్తిగల యువతీ, యువకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పాఠశాల సిఎఓ విజయ్ చందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.ఎన్.నాయుడు

డిఆర్ఒ, ఎఎస్‌పిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి- రాయచోటి

అన్నమయ్య జిల్లా కొత్తగా బాధ్యతలు తీసుకున్న డిఆర్ఓ మధుసూదన్‌రావు, జిల్లా అడిషనల్ఎస్ పి.వెంకటాద్రిని గురువారం వారి కార్యాలయాలలోఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు, వడ్డెర విద్యావంతులు వేదిక కాంట్రాక్టర్ డేరంగుల గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దళితులు బడుగు బలహీన వర్గాల వారు ఎదుర్కొంటున్న సమస్యలు వారిపైనా, దౌర్జన్యాలు భూ ఆక్రమణల గురించి అధికారులకు వివరించారు. పేదల పట్ల సహృదయంతో న్యాయం చేకూర్చాలని వారు అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన ఇరువురు అధికారులు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా న్యాయంజరిగేలా చూస్తామని వారు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు లక్ష్మయ్య, మైనారిటీ నాయకులు దౌలత్‌ఖాన్ పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న వాల్మీకి నేతలు

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

- రిలే నిరాహార దీక్షలో వాల్మీకి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : వాల్మీకులను ఎస్‌టి జాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేస్తూ వాల్మీకి సంఘ నేతలు రిలే నిరాహార దీక్షలకు దిగారు. గురువారం వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి మదనపల్లె పట్టణం చిత్తూరు బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షకు పూనుకుంది. ఈ సందర్భంగా వాల్మీకి సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో వాల్మీకి, బోయల ఎస్‌టి బిల్లును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌టి జాబితాలోకి చేర్చి సంపూర్ణ న్యాయం జరిగేంత వరకు దీక్షను విరమించబోమని హెచ్చరించారు. ఈ రిలే దీక్షల్లో వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పొదల నరసింహులు, రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ రాష్ట్ర నేతలు మేకల విజయ్ మోహన్, పూలకుంట్ల హరి బాబు, టేకుపల్లి శ్రీనివాసులు, విష్ణు, పొట్ట నరసింహులు, బొగ్గిటి మధు, చెన్నం రమణ, రాజా, బొంగువారిపల్లి కమలాకర్, అంబులెన్స్ సూరి పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్ పరీక్షలు తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయ ఎం.ఎ, ఎంకాం, ఎంఎస్‌సి సెమిస్టర్ల పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయ ఆవరణలోని ఎపిజె అబ్దుల్ కలాం గ్రంథాలయంలో ప్రారంభమైన పరీక్షలను వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.వి.కృష్ణారావు తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆచార్య కాత్యాయని మాట్లాడుతూ పీజీ పరీక్షలకు 488 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు డిసెంబరు 4 వరకు కొనసాగుతాయన్నారు. పరీక్షల నిర్వహణలో సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డాక్టర్ మునికుమారి, కడపలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రతి విద్యార్థీ లక్ష్య సాధనతో ముందుకెళ్లాలి : డిఇఒ

ప్రజాశక్తి- రాయచోటి : ప్రతి విద్యార్థీ లక్ష్య సాధనతో ముందుకెళ్లాలి జిల్లా విద్యాశాఖ అధికారి కె. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా పట్టణంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన ముగ్గులు, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయన్ పి.శివారెడ్డి స్వామి ఆర్థిక సాయంతో అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన డిఇఒ, ట్రాఫిక్ సిఐ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా డైట్ కళాశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయడం చాలా సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం దాత అధ్యక్షుడు లయన్ పి.శివారెడ్డి స్వామి మాట్లాడుతూ తన వంతుగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే విద్యార్థులకు బహుమతులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, డిస్ట్రిక్ చైర్మన్ లయన్ వి.హరీష్ చంద్ర స్వామి, డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, లెక్చలర్స్ శివ భాస్కర్, రెడ్డప్ప రెడ్డి, నాగరాజా, అసదుల్లా, రెడ్డయ్య, జై భరత్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డిఇఒ, సిఐ

ఇద్దరు అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

17 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పలు దొంగతనాలకు పాల్పడిన అంతర్ జిల్లా ఘరానా దొంగలను అన్నమయ్య జిల్లా సుండుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాయచోటి రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో డిఎస్‌పి కృష్ణమోహన్ నిందితుల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆగస్టులో సుండుపల్లె మండల కేంద్రంలో మూడు ప్రాంతాలలో జరిగిన చోరీ కేసులకు సంబంధించిన సుమారు రూ.24 లక్షలు విలువ చేసే 17 కిలోల వెండి, 130 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశామని, సుండుపల్లి మండల కేంద్రంలో ఉన్న రెండు నివాసాలతో పాటు ఓ జ్యువలరీ షాప్ లో వరుస చోరీలు జరిగిన విషయం తెలిసిందే అన్నారు. ఈ కేసుల్లోని నిందితుల కోసం గాలిస్తుండగా ఓ కేసులో పట్టుబడి సిద్ధవటం పోలీసుల అదుపులో ఉన్న కడప జిల్లా అట్లూరు మండలానికి చెందిన గొర్ల కుమార్ అలియాస్ అమర్ రాజ్ కుమార్, అన్నమయ్య జిల్లా రాజంపేట మండలానికి చెందిన గుమ్మాల వెంకటసుబ్బయ్య అనే ఇద్దరు నిందితులను కోర్టు ఆదేశాల మేరకు విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. నిందితులు మూడు కేసులలో చోరీ చేసిన సుమారు రూ.24 లక్షలు విలువ చేసే 17 కేజీల వెండి, 130 గ్రాముల బంగారు ఆభరణాలను సుండుపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో దాచి ఉంచగా నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. వారిని పట్టుకున్న రాయచోటి రూరల్‌సిఐ వరప్రసాద్, సిసిఎస్ సిఐ చంద్రశేఖర్ తోపాటు తన సిబ్బందిని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి కృష్ణమోహన్, స్వాధీనం చేసుకున్న వెండి ఆభరణాలు



ఆక్రమణలను తొలగిస్తున్న జెసిబి

రెండో రోజూ ఆక్రమణలు తొలగింపు

- పర్యవేక్షించిన కమిషనర్ పల్లవి, సిఐ రాజారెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో రెండో రోజూ అక్రమ కట్టడాలు తొలగింపును అధికారులు చేపట్టారు. పట్టణంలోని రంగసముద్రం రోడ్డు, మదనపల్లి రోడ్డు, పిటిఎం రోడ్డులో మూడు జెసిబిలు ఏర్పాటు చేసి ఆక్రమ కట్టడాలను కమిషనర్ పల్లవి, సిఐ రాజారెడ్డి పర్యవేక్షణలో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగునీటి కాలువలపై ఏర్పాటు చేసిన అక్రమ కట్టడాలు తొలగించాలని వారం రోజుల క్రితం ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. వారు ఆ నోటీసులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అక్రమ కట్టడాలను నగర పంచాయతీ, పోలీస్ వారి సమక్షంలో తొలగించినట్లు తెలిపారు. మరోసారి అనుమతులు లేకుండా బంకులు ఏర్పాటు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని బహుదానది వంతెన కింద అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని కోరుతూ విద్యార్థి నాయకుడు మాలతోటి నరేష్ తహశీల్దార్ సావిత్రిబాయిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ మండంలోని అద్దవారిపల్లి, గుండ్లూర్ గ్రామపంచాయతీలో ఉన్న బహుదానది వంతెన కింద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని అన్నారు. బహుదానది గట్టున ఇరువైపులా రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారని అన్నారు. వంతెనపై బస్సులు, కార్లు, ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుం టాయని అన్నారు.వంతెన కింద ఇసుకను తోడేస్తుండటంతో కూలిపోయే ప్రమాదం ఉందని అన్నారు. దానితోపాటు భూగర్భ జలాల ఇంకిపోయి వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్న సన్న, చిన్న కారు రైతులు సాగునీటికి ఇబ్బంది పడతారని అన్నారు. ఇసుక అక్రమ రవాణా ను అరికట్టాలని తహశీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ కచ్చి తంగా ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే సహించేది లేదని అన్నారు.

'ఉపాధి' నిధులు వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి వీరబల్లి

రాష్ట్రంలో ఉపాధి హామీ నిధులు దాదాపు పదివేల కోట్లు ఎన్‌డిఎ ప్రభుత్వం ఖర్చుపెట్టే పరిస్థితులు ఉన్నాయని ఎఫ్ఆర్‌డిఎస్ చైర్మన్ రాజశేఖర్‌రాజు గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. ఇందులో నుంచి 10శాతం వ్యవసాయ రంగానికి కేటాయిస్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని అన్నారు. రైతు విత్తనం నాటిన మొదలు నుంచి కోత దశ వరకు వ్యవసాయ కూలీలకు పని దొరుకుతుందని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ కూలీల ఖర్చులు ఉపాధి నిధులతో వ్యవసాయ కూలీలకు లభ్యమవుతాయని అన్నారు. రైతు వ్యవసాయానికి పెట్టే పెట్టుబడుల్లో సగభాగం తగ్గుతుందన్నారు. ప్రతి రైతు పంట పెట్టు కోవడానికి వీలవుతుంది చెప్పారు. ఉపాధి నిధులతో కంపలు కొట్టడానికి, గుంతలు తవ్వడానికి ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ పనులతో నిధులు వృథా అవుతున్నాయని అన్నారు. వ్యవసాయ రంగానికి నిధులు అనుసంధానం చేయాలని కోరారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ బాలక్రిష్ణారెడ్డి

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-కలికిరి

మండలంలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని డిఎల్‌పిఒ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కలికిరి, పత్తేగడ పంచాయతీలను సందర్శించారు. రికార్డులను పరిశీలించి పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాల మరమ్మతులు తదితర సమ స్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. ముఖ్యంగా స్వర్ణ పంచాయతీ యాప్‌లో హౌస్ హోల్డ్ మ్యాపింగ్, డిజిటలైజేషన్ ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మహమ్మద్ రియాజుద్దీన్, కలికిరి మేజర్ పంచాయతీ ఇఒ జి.అశోక్, పత్తేగడ పంచాయతీ కార్యదర్శి గిరి పాల్గొన్నారు.

కడప పెద్దదర్గాను సందర్శించిన 'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు గురువారం కడప పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నారు. దర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజ సయ్యద్ షా ఆరిపుల్లా మహ్మద్ మహ్మదుల్ హుస్సేనిని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు పొంది, పీఠాధిపతిని శాలువ కప్పి సన్మానం చేశారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందరభంగా ఆయన మాట్లాడుతూ పెద్దదర్గాను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. ప్రసాద బాబు వెంట తౌహిద్‌ఖాన్, బడిశెట్టి రవి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నివార ణకు సహకరించాలని మండల ప్రజలను ఎస్ఐ రంగారావు కోరారు. ఆ మేరకు గురువారం ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మోటర్ బైకులు వేసుకొని అతి వేగంగా వెళుతున్నారని, దీనివల్ల ప్రమా దాలు జరుగుతున్నాయని తెలి పారు. పాఠశాలకు మోటర్ బైకులో వెళ్లకుండా తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు కూడా ఖాకీ డ్రసు వేసుకోవాలని, ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామన్నారు. దుకాణాల వద్ద బైకులను రోడ్డుపై పెడితే వారిక కూడా జరిమానాలు తప్ప వన్నారు. స్కూల్ పిల్లలను పరిమితి సంఖ్యలోనే తీసుకెళ్లాలని ఆటోడ్రైవర్లకు సూచించారు. ఆటోలో వెనుక వైపు వేలాడేలా కూర్చో బెట్టరాదన్నారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక భాగం హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడపడం వల్లే జరుగుతున్నాయని ఆయన వివరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్ట ప్రకారమైన చర్యలు తీసుకొంటామని ఎస్ రంగారావు హెచ్చరించారు.

శిథిలావస్థలో ప్రాథమిక పాఠశాల



శిథిలావస్థలో ఉన్న పాఠశాల



పెచ్చులూడుతున్న భవనంపై కప్పు

- కూలడానికి సిద్ధంగా ఉన్న గోడలు
- పెచ్చులూడుతున్న పైకప్పు
- భయంగుప్పిట్లో విద్యార్థులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గాలివీడు పంచాయతీ నడింపల్లి ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల గోడలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వర్షం వచ్చిదంటే పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలలో చుట్టుపక్కల ఉండే బలిజపల్లి, నడింపల్లి, దక్షిణగడ్డ దళితవాడ, పత్తూరువాళ్లపల్లి, మూలపల్లి, మూలవడ్డేపల్లికి చెందిన 38 మంది విద్యార్థులు విద్యను అభ్యసి స్తున్నారు. ప్రాథమిక పాఠశాల కావడంతో అందరూ పదేళ్లలోపు పిల్లలే కావడంతో పాఠశాల పంపాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఒకరు పదోన్నతిపై వెళ్లిపోయారు. ఏకోపాధ్యాయుడే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం నాడు-నేడు అనేక పాఠశాలలపై దృష్టిసారించినా ఈ పాఠశాలను మాత్రం విస్మరించిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. నాడు-నేడు రెండు విడతల్లో కూడా ఈ పాఠశాలను చేర్చలేదని అన్నారు. మొండిగోడల మధ్యే తమ పిల్లలు పాఠాలు వింటున్నారని తెలిపారు. పాఠశాల ఆవరణంలో కూడా పిచ్చి మొక్కలు పెరిగడంతో విష పురుగులు సంచరించే ప్రమాదముందని అన్నారు. పాఠశాల ఆవరణంలో కూడా పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా దృష్టి పెడితే పాఠశాల పురోభివృద్ధి జరుగుతుందని అన్నారు. ప్రమాదం జరగకముందే విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా పాఠశాల భవనాలను నిర్మించి విద్యార్థుల పురోగాభివృద్ధికి తోడ్పడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పిల్లలను బడికి పంపాలంటే భయంగా ఉంది



ప్రాథమిక పాఠశాల శిథిలావస్థలో ఉండటంతో పిల్లలను బడికి పంపాలంటే భయంగా ఉంది. పిల్లలు పాఠశాలలో ఉన్నప్పుడు వర్షం వచ్చిందంటే ఏ ప్రమాదం జరుతుందోమోనని ఆందోళన చెందుతున్నాం. అధికారులు దృష్టి సారించి పాఠశాలలో మరమ్మతులు చేపట్టాలి.

-రమణ, విద్యార్థి తండ్రి

పాఠశాల దుస్థితిని మంత్రి దృష్టికి తీసుకెళతాం



ప్రాథమిక పాఠశాల పరిస్థితిని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. మూడు కిలోమీటర్ల పరిధి వరకు ఉండే గ్రామాల నుంచి పిల్లలు ఇక్కడే విద్యను అభ్యసిస్తున్నారు. కూల డానికి సిద్ధంగా ఉన్న పాఠశాల పునర్నిర్మాణంపై దృష్టి సారిం చాలి.

-గాలివీటి నారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాలలో వర్షం వస్తే పిల్లలను బయట కూర్చునే పరిస్థితి ఏర్పడింది. పైపెచ్చులుఊడిపడుతున్నాయి. ఆందోళనగా ఉంది. పాఠశాల దుస్థితిపై ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నాడు-నేడు కింద రెండు విడతల్లో కూడా ఈ పాఠశాల అభివృద్ధికి నోచుకోలేదు. విద్యార్థుల సమస్య త్వరగా పరిష్కారం కావాలి.

-బండి హరి, ప్రధానోపాధ్యాయుడు

పంటల సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన



పంటలను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని మేడికుర్తి, చీకటివారిపల్లి, రాజువారిపల్లి గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు రబీ పంటల సాగులో ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఎడిఎ ఎస్ అశోక్ కుమార్ రెడ్డి, డిఆర్‌సి ఎఒ శ్రీగంగాధర్ కలికిరి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వై. పీరుసాహెబ్ పాల్గొని రబీ పంటల సాగు పద్ధతులను వివరించారు. కొబ్బరి, టమోటా, మిరప, వేరుశనగ పంటలపై క్షేత్ర సందర్శన చేసి తెగుళ్ల పురుగుల నివారణ చర్యల గురించి వివరించారు. కొబ్బరిలో సర్పిలాకార తెల్ల దోమ ఆశించినప్పుడు వృత్తా కారంలో తెల్లటి దోమలు ఆకుల క్రింద భాగాన్ని ఆశించి రసం పీల్చడం వల్ల నల్లటి మసిమంగు ఆకంతా వ్యాపించి చెట్టు ఎండిపోయి పూత పిందెలు రాలిపోయి చిన్న కాయలు వస్తాయని అన్నారు. మామిడి, జామ, సీతాఫలం, అరటి, నేరేడు తోటలకు వ్యాపిస్తుందని అన్నారు. దీని నివారణకు పసుపు జిగురు పల్లాలు ఎకరాకు 20 చొప్పున అమర్చుకొని తర్వాత వేప నూనె 1 మి.ల్లీ లీటరు నీటిలో కలిపి ఆకులన్నీ బాగా తడిచేటట్లు పిచికారి చేయాలన్నారు. జిల్లా అంతట కొబ్బరి తోటల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. టమోటోలో ఎర్రనల్లి ఆశించడం వల్ల ఆకులు ఇటుక రంగులో మారి కాయలు కూడా అదే రంగులోకి మారి నాణ్యత, ధర తగ్గుతుందని అన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు పంట చివరి దశలో ఈ నల్లి ఎక్కువగా ఆశిస్తుందన్నారు. నివారణగా ప్రొఫెర్గెట్ 400 మి.ల్లీ 200 లీ. నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారి చేయాలని తెలిపారు. మిరప పంటలో నల్ల తామర పురుగులు ఆకుల క్రింది భాగాన, పువ్వులను ఆశించడం వల్ల పూత రాలిపోయి పంటలో దిగుబడి విపరీతంగా తగ్గిపో తుందన్నారు. రబీ వేరుశనగలో విత్తన శుద్ధి ఎలా చేసుకోవాలో రైతులకు చేసి చూపించారు. విత్తన శుద్ధి చేయడం ద్వారా పంటలో మొదటగా ఆశించే తామర పురు గులు, మొవ్వకుళ్ళు వైరస్ తెగులు, మొదలకుళ్ళు, వేరు కుళ్ళు తెగులు నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంల ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుక్కల స్వైర విహారం

- భయాందోళన చెందుతున్న గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రం పుల్లంపేటతో పాటు చుట్టూ పక్కల గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బయటకు వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తు తున్నారు. మండల చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఏదో ఒక అవసరాల నిమిత్తం మండల కేంద్రం పుల్లంపేటకు ప్రతిరోజూ వస్తూ పోతూ ఉంటారు. గ్రామాల్లో ని ప్రధాన రోడ్లు, వీధులు, రోడ్లు, పొలాల గట్టుపై కుక్కల గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు బయట రావాలంటే జంకుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు బయ టకు పంపాలంటే భయంగా ఉందని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. వాహన దారులు, పాదచారులు కుక్కలు బెడద చూసి వణికి పోతున్నారు. మండల కేంద్రంలో కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. వాహనాల వెంబడి పరుగులు తీస్తుండటంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతు న్నామని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపాలంటే భయంగా ఉందని, ఎక్కడ దాడి చేస్తాయోనని అన్నారు. వీధి కుక్కల సంఖ్య మండల వ్యాప్తంగా అనేక గ్రామాలలో అధికమైనప్పటికీ వాటికి నియంత్రణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫల మయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇళ్లలో ఉన్న కోళ్లను సైతం ఎత్తుకు పోతున్నాయని వాపోతు న్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మండల వ్యాప్తంగా ఉన్న కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

వేరుశనగ సాగుకు అనుకూలం : ఎఒ



వేరుశనగ పంట

ప్రజాశక్తి-వీరబల్లి

రబీలో నీటి వసతి కింద వేరుశనగ పంట విత్తుకు నేందుకు డిసెంబర్ 15 వరకు అనుకూల సమయమని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వాతి పేర్కొన్నారు. ఈ రబీ లో మండల వ్యాప్తంగా 200 హెక్టార్ల విస్తీర్ణంలో వేరుశనగ సాగులోకి రావచ్చని అంచనా వేసినట్లు తెలిపారు. రెండు రోజుల తర్వాత వర్షాలు కురిస్తే వేరుశనగ పంట ఇంకా కొన్ని హెక్టార్లు పెరగవచ్చు అన్నారు. వీరబల్లి మండలంలో తక్కువ వర్షపాతం నమోదైన అక్కడక్కడ వ్యవసాయ బోర్లలో నీరు ఉండే రైతులు వేరుశనపంట సాగు చేసుకోవచ్చని సూచించారు. తొలి దశలో పంటలకు చీడ పీడలు, తెగుళ్ల ఆశించకుండా ఉండేందుకు కిలో విత్తనానికి 2 మి. లీ. ఇమిడాక్లోప్రిడ్,3 గ్రాముల మాంకోజెబ్, కలిపి విత్తన శుద్ధి చేసుకుని విత్తుకోవాలన్నారు. విత్తుకున్న 24 గంటల నుంచి 48 గంటల లోపు ఎకరాకు ఒకటి లేదా ఒకటిన్నర లీటర్ల చొప్పున కలుపు ముందు 20 శాతం పెండీమిథలిన్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. రసం పీల్చే పురుగు ఉధృతి తగ్గించేందుకు పొలం చుట్టూ నాలుగైదు వరసల్లో సజ్జ, జొన్న, విత్తనాలను రక్షణ పంటగా విత్తుకోవాలని తెలిపారు. పంట కాలంలో సిఫారసు చేసిన మోతాదులో మందుల పిచికారి, ఎరువుల వాడకం, నీటి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ జాగ్రత్తలు తీసుకోవడం వలన వేరుశెనగ పంటలో అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు.

గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన మేదర రవికుమార్‌ను టిడిపి నేతలు సన్మానించారు. స్థానిక గండి రోడ్డులోని తన నివాసంలో ఉన్న రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ మేదర రవికుమార్‌ను టిడిపి జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్ బాషా (యంగ్ బాయ్), మైనార్టీ నేత డాక్టర్ కరీముల్లా ఆధ్వర్యంలో మైనార్టీ నేతలు సన్మానించారు. టిడిపి కోసం పని చేసినందుకు గుర్తింపుగా సిఎం చంద్రబాబు సామాన్య కార్యకర్త మేదర రవికుమార్‌కు రాష్ట్ర డైరెక్టర్ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందని జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్ బాషా తెలిపారు. గిరిజనుల అభివృద్ధితోపాటు టిడిపి కోసం కూడ పని చేయాలని వారు కోరారు. సన్మాన కార్యక్రమంలో టిడిపి నేతలు పక్కిర్‌పల్లె లాడెన్ బాషా, , టోపి పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పిల్లల ఆరోగ్యం పట్ల పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని వైఎంఆర్ కాలనీ పిహెచ్‌యు వైద్యాధికారి హిమబిందు సూచించారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రాథమిక పాఠశాల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తెలియని వయసులో ఉన్న చిన్నపిల్లలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించే ప్రమాదం ఉందని, ఈ సమయాల్లో అన్ని జాగ్రతలు పెద్దలు తీసుకోవాలన్నారు. పిల్లలకు ప్రతి విషయాన్ని ఓపిగ్గా అర్థమయ్యేరీతిలో చెప్పాలన్నారు. వ్యక్తిగత, పరి సరాల శుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పిం చారు. వార్డు హెల్త్ కార్యదర్శి జ్యోతి 30 మంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ టీచర్ ఖాసిం, ఉపాధ్యాయులు, సిఒ ఎంవిసుబ్బారెడ్డి, ఆశాలు పిల్లి పుష్పకుమారి, మల్లీశ్వరి విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు హర్షణీయం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె : రాయలసీమలోని కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1937 నాటి శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాజధాని, హైకోర్టు ఈ రెండింటిలో ఒకదానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలని ఉందన్నారు. దురదృష్టవశాత్తూ రెండు కూడా అమరావతిలోనే ఏర్పాటయ్యాయని తెలిపారు. హైకోర్టు రాకపోయినా హైకోర్టు బెంచ్ కర్నూలులో ఏర్పాటు నిర్ణయం అభినందనీయమని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తే రాయలసీమకు హైకోర్టు బెంచ్ తప్పక వస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ నాగయ్య

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-నందలూరు

విజ్ఞానాన్ని భాండాగారాలు గ్రంథాలయాలని మండల విద్యాశాఖ అధికారి-1 ఎల్.నాగయ్య పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ముగింపు వేడుకలు గురువారం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ఎంఇఒలు ఎల్. నాగయ్య, సిఆర్ అనంతకృష్ణ విద్యార్థులను హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించు కోవాలన్నారు. గ్రంథాలయాలకు వెళ్లి జ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో వివిధ పుస్తకాలు అందుబాటులో ఉంటాయని శాఖ గ్రంథాలయాధికారి రవిశంకర్ రాజు అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత తహశీల్దార్ జయన్న, ఉపాధ్యాయులు లోకమాన్ సింగ్, కృపానందం, వెంకటసుబ్బయ్య, పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందించారు.



సిసి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సిసి రోడ్డు పనులు వేగవంతం చేయండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-రామసముద్రం

సిసి రోడ్డు పనులు వేగవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి భానుప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని చెంబకూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణిత సమయంలో రోడ్లను పూర్తి చేయాలని నిర్వాహకులుకు సూచించారు. మండల పరిధిలో ఇప్పటికే కొన్ని రోడ్లు ప్రారంభం అయ్యాయని తెలిపారు. మరికొన్ని చోట్ల ఇంకా పనులు మొదలు కాలేదని చెప్పారు. ఈ నెలాఖరులోగా అన్ని చోట్లా పనులు పూర్తి చేయడానికి సన్నాహాలు జరుగుతు న్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిప్పన్న, పంచాయతీ కార్యదర్శి రెడ్డి శేఖర్, రమణ పాల్గొన్నారు.

దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామాలను కాపాడండి

- శాసనమండలిలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దాల్మియా సిమెంట్ పరిశ్రమ నుంచి దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామాలను కాపాడాలని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి కోరారు. గురువారం శాసనమండలిలో ఆయా గ్రామాలపై ఆయన మాట్లాడుతూ దుగ్గనపల్లి గ్రామం పరిశ్రమకు దగ్గరగా ఉందన్నారు. కేవలం 50 ఎస్సీ కుటుంబాలు మాత్రమే నివసి స్తున్నాయని, వర్షాకాలంలో అధికంగా వరదలు సంభవి స్తున్నాయన్నారు. నవాబుపేట, దుగ్గనపల్లి గ్రామ రైతులు సిమెంటు పరిశ్రమ వల్ల సారవంతమైన భూములను పంటలు వేయకుండా ఖాళీగా ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పరిశ్రమ నుంచి వెలువడే దుమ్ము, ధూళి ఇతర వ్యర్థాలతో రైతులు, సామాన్యులు నష్టపోతున్నారన్నారు. స్థానిక అధికారులు దాల్మియా వారికి తలొగ్గి తప్పుడు నివేదికలు ఇస్తూ ఆయా గ్రామాల వారిని ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి దుగ్గనపల్లి గ్రామాన్ని సురక్షితమైన ప్రదేశానికి తరలించాలని, 150 ఎకరాల రైతులకు నష్టపరిహారం చెల్లించి, వారికి మరోచోట భూమిని కల్పించాలన్నారు. దాల్మియా మరో ప్లాంటును ఏర్పాటు చేస్తే అది 150 ఎకరాల ప్లేస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



లక్ష్మి భాయి (ఫైల్ ఫోటో)

ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ పట్టణ నడిబొడ్డున ఉన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన గురువారం పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, కోటగడ్డ వీధిలో ఉన్న లేట్ కోదండరావు భార్య లక్ష్మీబాయి(45)కు 15ఏళ్ల క్రితం భర్త మృతి చెందాడని తెలిపారు. కూలీ పనులు చేసుకుంటూ కుమారుడు, కుమా ర్తెను పోషించుకునేదని అన్నారు. అప్పులు చేసి కుమార్తెకు వివాహం చేసింది. కుమారుడు డిగ్రీ వరకు చదువుకొని ఏ ఉద్యోగం చేయకుండా ఇంటిపట్టునే ఉండటంతో ఆర్థిక సమస్యలు చుట్టు ముట్టాయని అన్నారు. కుమారుడికి బాధ్యత లేకపోవడం, కుటుంబ సమస్యలు రోజురో జుకు పెరిగిపోవుతుండడంతో తీవ్ర మనస్థాపానికి గురైన మహిళ ఉదయాన్నే చెరువు గట్టు వద్దకు వెళ్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. స్థానికుల సమాచారంతో పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లను చెరువులోకి దింపి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండవ పట్టణ సిఐ రామచంద్ర తెలిపారు.

అవ్వ, మనవడిపై దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు అడ్డంగా ఉన్న రాళ్ళను తొలగించమన్నందుకు అవ్వ, మనవడిపై ముగ్గురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గురువారం మదనపల్లి మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. అంకిశెట్టిపల్లి పంచాయతీ మునగమాకులపల్లెకు చెందిన వెంకటేశ్వర తన ఇంటి వద్ద రోడ్డును ఆక్రమించుకొని రాళ్లను అడ్డుగా పెట్టాడని తెలిపారు. ఇదే ప్రాంతంలో నివాసమున్న పి.శ్రీనివాసులు కుమారుడు పి.బాలకృష్ణ కారు నడుపుకుంటూ జీవనం సాగించేవారని చెప్పారు. బుధవారం రాత్రి ఇంటికి వెళ్తున్న సమయంలో కారుకు రాళ్లు తగిలించారన్న నెపంతో గురువారం ఘర్షణకు దిగినట్లు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టడంతో తన వాహనం ఎలా వెళ్లాలని వెంకటేశ్వర్లును నిలదీయడంతో తమరాళ్లు తగిలించడమే కాకుండా మా పైనే తిరగబడతావా అంటూ ఒక్కసారిగా దాడికి తెగబడ్డారని అన్నారు. వెంకటేశ్వర, శివరామ్, రత్నమ్మలు కలిసి బాలకృష్ణను కిందపడేసి కొడుతుండగా అవ్వ గంగులమ్మ అడ్డు కోబోగా ఆమెను కూడా కిందపడేసి తీవ్రంగా కొట్టారని పేర్కొన్నారు. స్థానికులు అడ్డుకొని బాధితులని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై తాలూక పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజన మహిళ మృతి

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని రాజంపేట-నెల్లూరు ప్రధాన రహదారి గట్టు మీద పల్లి వద్ద గురువారం రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులకు వివరాలు మేరకు..ఏం రాచపల్లి ఎస్‌టి కాలనీకి చెందిన ఏకసిరి పెంచలమ్మ(45) కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం నుండి ద్విచక్ర వాహ నంలో పెనగలూరు మండలం కట్టవారిపల్లికి వెళుతూ ఉండగా, చిట్వేలి నుంచి రాపూర్‌కు వెళుతున్న లారీ కింద ప్రమాదవశాత్తు పడి పెంచలమ్మ అక్కడి కక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.